క్లుప్తంగా

జూనియర్ అసిస్టెంట్‌గా సోనీ



సదుం: మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా సోనీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జెడ్పీ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. గతంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రామచంద్ర ఉద్యోగోన్నతిపై పూతలపట్టుకు బదిలీ అయ్యారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులు మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సమన్వయకర్త వెంకట సిద్దులు, హెచ్‌ఎం శ్రీవాణి అవగాహన కల్పించారు. గురువారం కల్లూరు హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. వాటికి బానిసలైతే చేజేతులా జీవితం నాశనం చేసుకున్నట్లేనని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్ర, రాజశేఖర్, పద్మవేణి, గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి కిరీటం సమర్పణ



ముత్యాలమ్మకు వెండి కిరీటం, నేత్రాలను సమర్పిస్తున్న దాతలు

రొంపిచెర్ల: రొంపిచెర్లలోని ముత్యాలమ్మకు అన్నమ్మయ్య జిల్లా మదనపల్లెకు చెందిన ఎం.ద్వారకనాథ రెడ్డి, భారతి దంపతులు 111 గ్రాములతో తయారు చేసిన వెండి కిరీటం, నేత్రాలను గురువారం సమర్పించారు. ఆలయ అర్చకుడు గుణశేఖర్ వాటిని స్వీకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో దాతలను సత్కరించారు.

గజ బాధితులకు రూ.14.20 లక్షలు పంపిణీ



గజ బాధితులకు పరిహార చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: పలమనేరు అటవీశాఖ రేంజి పరిధిలో ఏనుగుల దాడుల కారణంగా పంటలు, పశువులను కోల్పోయిన 189 మంది బాధితులకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి గురువారం రూ.14.20లక్షల పరిహారం చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ముసలిమొడుగు వద్ద ఎలిఫెంట్ హబ్‌కు త్వరలో కుంకీ ఏనుగులు రానున్నాయని, వాటితో ఇక్కడి మదపుటేనుగులను కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎలిఫెంట్ టూరిజం కారిడార్ కారణంగా ఈ మార్గంలో కర్ణాటక నుంచి తిరుమలకు వెళ్లే యాత్రికులకు ఇదో మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణకు మంత్రి నివాళి



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పుంగనూరు: తెలుగుదేశం కార్యకర్త రామకృష్ణ దశ దిన కర్మలకు గురువారం రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామకృష్ణను హత్య చేసిన నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, మురళి, బొజ్జల సుధీర్‌రెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లారామచంద్రా రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'బార్' అసోసియేషన్ అధ్యక్షుడిగా చెన్నకేశవులు



పుంగనూరు: పుంగనూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రెండవ సారి ఆకుల చెన్నకేశవులు 68 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి శివప్పనాయుడు తెలిపారు. అధ్యక్ష పదవికి ఆకుల చెన్నకేశవులు, ఎల్‌వీ.రమణ పోటీ పడటం విదితమే. మిగిలిన పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఉపాధ్యక్షుడిగా అరవిందకుమార్, కార్యదర్శిగా రఘునాథరెడ్డి, సహాయ కార్యదర్శిగా జహార్‌బాషా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శివప్పనాయుడుతోపాటు వీర మోహన్‌రెడ్డి, సురేష్‌బాబు వ్యవహరించారు.

రామకుప్పంలో హై టెన్షన్!

- అడుగడుగునా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను అడ్డుకున్న టీడీపీ
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రాకనే ఎంపీపీ ఎన్నిక ముగింపు



ఎన్నికలకు వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను అడ్డుకున్న టీడీపీ నేతలను వారిస్తున్న పోలీసులు

కుప్పం: రామకుప్పం మండల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా గురువారం హై టెన్షన్ నెలకొంది. తమ పార్టీ వారికి పదవుల్లో నియమించుకునేందుకు అధికార పార్టీ అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ పోలీసు బలగాల మధ్య ఎన్నికలు నిర్వహించినా కోరం లేకనే టీడీపీ అభ్యర్థి సులోచనను ఎంపీపీగా, వైస్ ఎంపీపీగా వెంట్రామగౌడును టీడీపీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 16 మంది ఎంపీటీసీలు ఉన్న రామకుప్పంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ శాంతకుమారి మృతి చెందడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు గురువారం ఎన్నికను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 8 మంది, టీడీపీకి ఏడుగురు ఎంపీటీసీలు ఉండడంతో వైఎస్సార్‌సీపీ గెలుపు లాంఛమని గ్రహించిన అధికార పార్టీ ఎంపీపీ పదవిని ఎలాగైనా దక్కించుకునేందుకు పన్నాగం పన్నింది. దీన్ని గ్రహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు తమ ఎంపీటీసీ సభ్యులను బుధవారం రాత్రి కర్ణాటకకు తరలించారు. అక్కడ నుంచి గురువారం ఉదయం వి.కోటలోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్వగృహానికి చేరుకుని రామకుప్పంకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు టీడీపీ వర్గీయులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ఏడుగురు టీడీపీ సభ్యులలో ఒకరు పరారీలో ఉండగా మిగిలిన ఆరుగురితోనే ఎంపీపీ ఎన్నికను ముగించారు! దీంతో అధికార పార్టీకి చెందిన సులోచనను రామకుప్పం ఎంపిపిగా, వైస్ ఎంపీపీగా వెంకట్రామయ్య గౌడు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

భారీగా మోహరించిన పోలీసు బలగాలు

రామకుప్పం ఎంపిపి ఎన్నిక ఉత్కంఠ నెలకొనడంతో భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించారు. 250 మంది పోలీసు బలగాలు రాజు పేట రోడ్డు నుంచి రామకుప్పం వరకు భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. పోలీసులు వి.కోటలోని జెడ్పీ చైర్మన్ ఇంటి నుంచి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను తరలించినా రామకుప్పానికి సమయానికి చేరుకోలేకపోయారు.

అడుగడుగునా అడ్డుకున్న అధికార పార్టీ

రామకుప్పం ఎంపీపీ ఎన్నికకు కోరం ఉన్న వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని గ్రహించిన అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రాకుండా ఉండేందుకు అడుగడుగునా అవరోధాలు సృష్టించింది. రాజుపేట రోడ్డు నుంచి 4 కిలోమీటర్లు వున్న రామకుప్పంలోని ఎన్నికల కార్యాలయానికి చేరుకునేందుకు వీలు లేకుండా అవరోధాలు సృష్టించింది. రోడ్డు మార్గంలో అక్కడక్కడా చెట్లు కూల దోసి ట్రాఫిక్ సమస్యను సృష్టించి ఇబ్బందులకు గురిచేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున రామకుప్పం రోడ్లపైకి వచ్చి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను అడ్డుపడ్డారు. దీంతో 11 గంటలలోపు ఎన్నికల అధికారి ముందు హాజరు కావాల్సిన వారు చేరుకోలేకపోవడంతో వ్యూహం ప్రకారం అక్కడున్న టీడీపీ ఎంపీటీసీ సభ్యులతో ఎన్నికను ముగించారు.

ఘీంకరి..అందరికీ వర్రీ..!



పేరావాండ్లపల్లె రోడ్డులో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేస్తూ ఉండడంతో ప్రజలు హడలిపోతున్నారు. రెండు నెలలుగా ఒంటరి ఏనుగు మండలంలోని పాళెం, కమ్మపల్లె పంచాయతీలలోని గ్రామాల్లో సంచరిస్తుండడంతో కంటికి కునుకు కరువైంది. గురువారం ఉదయం 10గంటలకు కమ్మపల్లె పంచాయతీ పేరావాండ్లపల్లె, గ్రామ సమీప పొలాలలో ఏనుగు సంచరించడం, అది ఘీంకరించడం చూసి ప్రజలు భయపడి పరుగులు తీశారు. ఎప్పుడు దాడి చేస్తుందోనని పొలాల వైపు వెళ్లడం కూడా మానేశారు. అటవీ అధికారులు ఈ ఏనుగును సరిహద్దులు దాటించాలని కోరుతున్నారు.

ఎస్సీల సమస్యలపై ముందుండి పోరాడుతాం



శ్యామ్‌సుందర్‌రాజు

పలమనేరు: రాష్ట్రంలోని ఎస్సీల సమస్యలపై ముందుండి పోరాడుతామని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా ముందుకెళతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రాజు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాలలకు జరిగిన సంక్షేమ పథకాలు కూటమి అధికారంలోకి రాగానే లేకుండా పోయాయన్నారు. ముఖ్యంగా క్రైస్తవులంటే గిట్టనట్టు కూటమి సర్కార్ వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఆరున్నర నెలలకే ప్రసవం!

- అత్యాధునిక వైద్యంతో ప్రాణం పోశారు



తల్లీ బిడ్డ గురించి వివరిసున్న సూపరింటెండెంట్

గుడుపల్లె: సాధారణంగా మహిళలు గర్భం దాల్చితే 9నెలలు తర్వాత ప్రసవించడం సహజం. అయితే ఆరున్నర నెలలకే ప్రసవిస్తే..శిశువు అతి తక్కువ బరువుతో పుడితే..!? ప్రసవం, శిశు సంరక్షణ ఒకింత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమే. అయితే అత్యాధునిక వైద్య చికిత్సతో ఓ గర్భిణికి ఈ తరహాలో కాన్పు చేసి, తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పీఈఎస్ వైద్యులు కాపాడారు. పీఈఎస్ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సుబ్రమణ్య గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపిన వివరాలు..చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్ పురం మండలం జంగాలపల్లెకు చెందిన రోషిణి కాన్పు నిమిత్తం జనవరి 18న పీఈఎస్ ఆసుపత్రిలో అడ్మిట్ అయిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేశారు. డెలివరీకి మామూలుగా 40 వారాల సమయం ఉండాలి. అయితే రోషిణికి 27 వారాలు మాత్రమే కావడంతో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి డెలివరీ చేశారు. రోషిణి మగశిశువుకు జన్మనివ్వడం, ఆ శిశువు బరువు 740 గ్రాములు మాత్రమే ఉండడంతో మూడు నెలలుగా ప్రత్యేక వైద్యం అందించారు. ఇప్పుడు 1.50 కిలోల బరువు వచ్చిందని వైద్యులు నిర్ధారించారన్నారు. వైద్యం అందించిన హరిచంద్ర, దీప్తి బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు.

డిగ్రీ విద్యార్థికి తహశీల్దార్ ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఫీజులు చెల్లించి రశీదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న హరిప్రసాద్ అనే పేద విద్యార్థికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత తహశీల్దార్ మాధవరాజు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అతని చదువుకు పూర్వ విద్యార్థులు సాయం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ కోరడంతో తహశీల్దార్ స్పందించి సాయం అందించారు. ఈ సొమ్మును ఆ విద్యార్థి ఫీజుల కింద కట్టారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్‌శంకర్, మనోహర్, హరినాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌కు పరికరాల విరాళం



ప్రభుత్వాసుపత్రికి పరికరాలు అందజేసిన కోకో కోలా కంపెనీ కో–ఆర్డినేటర్లు, డాక్టర్ తదితరులు

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలను హిందుస్తాన్ కోకో కోలా బేవరేజ్ కంపెనీ సుమారు రూ.3 లక్షల విలువ చేసే పరికరాలను విరాళంగా అందజేసిందని డాక్టర్ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన సేవల నిమిత్తం ఆరు పరికరాలు ఎయిర్ కండీషన్ ఏసీ, మానిటర్, మందుల ట్రాలీ, ఓటీ హెడ్ లాంప్, ఆటోక్లేవ్ మెషిన్, హైడ్రాలిక్ ఓటీ టేబుల్‌ను సమకూర్చినట్లు చెప్పారు. వీటితోపాటు ఆ కంపెనీ సహకారంతో రోగులు, సిబ్బంది ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. కోకో కోలా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ కంపెనీ కో–ఆర్డినేటర్లు వినయ్ శ్రీనివాస్, జెరూషా పాల్గొన్నారు.

పోలీసుల చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీఎస్పీ ప్రభాకర్, సీఐ

గంగవరం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట వేసవి చలివేంద్రాన్ని డీఎస్పీ ప్రభాకర్, అర్బన్ సీఐ ప్రసాద్ గురువారం ప్రారంభించారు. మండు వేసవిలో ప్రయాణికులు, వృద్ధుల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ, మంచినీళ్లతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గ్రామాలు, రహదారుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

పంటలకు వన్యమృగాల బెడద

- వరి పంటను ధ్వంసం చేస్తున్న అడవి పందులు
- అరటి, కూరగాయల పంటలను నాశనం చేస్తున్న వానరాలు



అడవి పందులు నాశనం చేసిన వరి పంట

గుడిపాల: పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో ఓవైపు వానరాలు.. మరోవైపు అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం, చింతగుంటూరు, కోటూరు, వసంతాపురం, బసవాపల్లె గ్రామాల్లో రైతులు వేసుకొన్న బీన్స్, బెండ, వంకాయ, టమాటా, అరటి పంటలను వానరాలు నాశనం చేస్తున్నాయి. దీంతో పాటు కొబ్బరిచెట్లలో ఉన్న కొబ్బరి కాయలను కూడా వదిలి పెట్టడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు బండపల్లె, అడవిచేను, వెప్పాలమానుచేను, చిత్తపార ప్రాంతాల్లో అడవిపందులు వరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారు. సంబంధిత అధికారులు అడవిపందులు, వానరాల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

ఢాం.. ఢాం..!

మండలంలో వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట పడటం లేదు. దీనిపై అటు అటవీశాఖ, పోలీస్ శాఖగానీ దృష్టి సారించి, పటిష్ట చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. వన్యప్రాణుల వేటకు వినియోగించే నాటుబాంబుల ధాటికి పెంపుడు జంతువులు సైతం మృత్యువాత పడుతున్నాయి.

- రాజులూరు వద్ద పేలుతున్న నాటుబాంబులు
- వరుసగా మూడురోజులుగా పేలుళ్లు
- మూడు కుక్కలు మృతి..?
- గతంలోనూ ఘటనలు
- పోలీసుల చర్యలు శూన్యం



రాజులురు వద్ద నాటు బాంబు పేలి తల ఛిద్రమై మృతి చెందిన పెంపుడు కుక్క



నాటుబాంబు ఉండ (ఫైల్)

చౌడేపల్లె: మండలంలో నాటుబాంబులతో వన్యప్రాణుల వేట కొనసాగుతోందని గురువారం మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులురు సమీపంలో చోటుచేసుకున్న ఉదంతం మరోసారి తేటతెల్లం చేసింది. ఇక్కడ పశువుల మేత భూములతోపాటు అటవీ ప్రాంతం సమీపంలోనే ఉంది. వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడేందుకు ఉచ్చులతోపాటు నాటు మందు ఉంటలను(నల్లమందుతో చుట్టిన నాటు బాంబులు) పెట్టి, హతమార్చి, వాటి మాంసాన్ని గుట్టుగా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోకి రైతులతోపాటు వెళ్లిన పెంపుడు కుక్కలు ఆ ఉండలను కొరకడంతో మూడురోజుల వ్యవధిలో మూడు కుక్కలు మృత్యువాత పడ్డాయని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. మరోవైపు మేత కోసం వెళ్లే పాడి ఆవులు సైతం ఇదే కోవలో మరణిస్తే జీవనాధారం కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. గతంలో దుర్గసముద్రం, చారాల, పెద్దకొండామర్రి, మడుకూరు, చెడుగుట్లపల్లె తదితర గ్రామ సమీపాల్లో పరిసర ప్రాంతాల్లో నాటు బాంబుల ఉండలు కొరికి పెంపుడు కుక్కలు మృత్యువాత పడిన ఘటనలు సైతం ఉన్నాయి. అసలు నాటుబాంబుల ఉండలు స్థానికంగా తయారు చేస్తున్నారా, బయట ప్రాంతాల నుంచి తెస్తున్నారా? వీటికి ముడి పదార్థాలు ఎవరు విక్రయిస్తున్నారు? అనే దిశగా అటు అటవీశాఖ అధికారులుగానీ, పోలీసులుగానీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే గతంలో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తుల ఆరోపణ. ఇక నల్లమందు బాంబుల ఉండలతోపాటు నాటు తుపాకీలతో కుందేళ్లు, ఇతర వన్యప్రాణులను వేటాడుతున్నారని, ఇకనైనా అధికారులు దృష్టి సారించి వేటగాళ్ల బారి నుంచి అటు పెంపుడు కుక్కలు, పశువులు, వన్యప్రాణులు బలికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సదుం ఎంపీపీగా మాధవి



ఎంపీపీ మాధవిని సన్మానిస్తున్న పెద్దిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి

సదుం: మండల పరిషత్ అధ్యక్షురాలిగా మాధవి గురువారం ఎన్నికయ్యా రు. గతంలో ఎంపీపీగా ఉన్న ఎల్లప్ప మృతి చెందడంతో ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ, ఎన్నికల ప్రత్యేక అధికారి భవానీ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. గతంలో మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. ఇందులో ఇద్దరు సభ్యులు మృతి చెందారు. మిగిలిన 8 మంది ఎన్నికలో పాల్గొన్నారు. పాలమంద ప్రాదేశిక సభ్యురాలు మాధవికి ఏడుగురు సభ్యులు మద్దతు పలకడంతో ఆమెను ఎంపీపీగా అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ హరిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, వైస్ ఎంపీపీలు ధనుంజయరెడ్డి, అమరావతి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఎంపీపీగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. ఎంపీపీగా ఎన్నికైన మాధవిని గురువారం వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించి మాట్లాడారు. అందరి సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, నిహాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీలు ధనుంజయ రెడ్డి, అమరావతి, ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కోరం లేక ఆగిన ఉప సర్పంచ్ ఎన్నిక

- తాళ్లపల్లె ఉపసర్పంచ్ ఎన్నిక నేటికి వాయిదా
- ఫలించని టీడీపీ ప్రయత్నాలు

గంగవరం: మండలంలోని తాళ్లపల్లె పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం నిర్వహించిన ఎన్నికలకు డీపీఓ సుధాకర్, ఎన్నికల అధికారి దేవీప్రియ, ఎంపీడీఓ సురేష్‌బాబు హాజరయ్యారు. అయితే పంచాయతీలోని 10 మంది వార్డు సభ్యులకు గాను కేవలం టీడీపీ నుంచి నలుగురు మాత్రమే హాజరయ్యారు. అయితే సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఆరుగురు కలిసి ఉపసర్పంచ్ ఎన్నికను బహిష్కరించారు. దీంతో ఎన్నికలు నిర్వహించాల్సిన అధికారులు కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్టు ప్రకటించి వెనుదిరిగారు. ఇదిలా ఉండగా పలమనేరు ఎమ్మెల్యేకు తాళ్లపల్లె స్వయానా తన తాతయ్యగారి గ్రామం కావడంతో దగ్గర సంబంధాలు ఉన్నాయి. అందుకే ఈ పంచాయతీలో ఏ ఎన్నికలు నిర్వహించినా పట్టు విడువకుండా తమ అభ్యర్థులనే గెలిపించుకునేవాళ్లు. అయితే రెండు పర్యాయాలుగా ఈ పంచాయతీలో టీడీపీ అభ్యర్థులను కాకుండా మరో పార్టీ అభ్యర్థులకు ప్రజలు గెలిపించారు. గతంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఇక్కడ గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఉప సర్పంచ్ ఎన్నికను టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తమకు బలం లేకపోయినా ఎలాగైనా తమ అభ్యర్థిని ఎన్నిక చేసుకోవాలని యత్నించి భంగపాటుకు గురైంది. ఉప సర్పంచ్ ఎన్నికలో టీడీపీ సభ్యులు ఐదుగురిలో నలుగురు మాత్రమే హాజరవడం, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పూర్తిగా బహిష్కరించడంతో టీడీపీకి దిక్కు తోచలేదు. వాయిదా పడిన ఎన్నికకు సరికొత్త ఎత్తుగడలు, వ్యూహంతో వెళ్లాలని యత్నిస్తున్నట్టు సమాచారం.





పలమనేరు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బాలాజీ నాయుడును అభినందిస్తున్న పార్టీ శ్రేణులు, పట్టణాధ్యక్షుడిగా నియమితులైన హేమంత్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

నియామకం..ఆత్మీయ సన్మానం

పలమనేరు: పలమనేరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా బాలాజీనాయుడు, పట్టణ అధ్యక్షుడిగా హేమంత్‌కుమార్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడంతో గురువారం వారిని మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు సన్మానించి అభినందించారు. తమపై అధిష్టానం, జిల్లా నాయకులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని వారు చెప్పారు. మండల నాయకులు చెంగారెడ్డి, రాజారెడ్డి, గజేంద్ర, కౌన్సిలర్లు రవి, కోదండరామయ్య, నయాజ్, రమేష్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వి.కోట మండల కన్వీనర్ యువరాజ్‌కు..

వి.కోట: ఎంపీపీ యువరాజ్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియమితులు కావడంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కన్వీనర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సత్కరించి అభినందించారు.

పెద్దపంజాణి కన్వీనర్ బాగారెడ్డికి..

పెద్దపంజాణి: మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా నియమితులైన బాగారెడ్డిని నాయకులు సన్మానించి అభినందించారు.



వి.కోట మండల కన్వీనర్ యువరాజ్‌ను అభినందిస్తున్న పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు



పెద్దపంజాణి: బాగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గంగవరంలో భాస్కర్‌రెడ్డి..



నూతన కన్వీనర్ భాస్కర్‌రెడ్డిని శాలువాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గంగవరం: వైఎస్సార్‌సీపీ గంగవరం మండల కన్వీనర్‌గా నియమితులైన మామడుగు సర్పంచ్ భాస్కర్‌రెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలు సన్మానించి అభినందించారు. తొలుత దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గంగవరం మాజీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, సిద్ధప్ప, పట్టాభిరామయ్య, రెడ్డి, ఆనంద, నరసింహారెడ్డి, మంజు, గురుమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బైరెడ్డిపల్లె: రోజు రోజుకూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, దీని బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు వహించాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. వడదెబ్బ–నివారణ చర్యలపై మండలంలోని తీర్థం పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎండల్లో బయటకు రావాల్సి వస్తే టోపీ, గొడుగు, తువ్వాలు వంటి వాటిని వినియోగించాలని కోరారు. ఎక్కువగా మజ్జిగ, నీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం, కొబ్బరినీళ్లు వంటివి తాగాలన్నారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తులను ధరించాలన్నారు. మసాలాలు ఉన్న ఆహార పదార్థాలు తక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎం మార్క్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.